జైన క్షేత్రాన్ని దర్శించుకున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి

కొల్చారం, ఆగస్టు 31: కొల్చారంలోని ప్రసిద్ధ జైన క్షేత్రంలో గల పార్శ్వనాథ స్వామిని మధ్యప్రదేశ్ జబల్‌పూర్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి విష్ణుజైన్, మెదక్ మెజిస్ట్రేట్ రీటాలాల్ చంద్‌తో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్షేత్రంలో చతుర్మాస్య దీక్షలు చేస్తున్న అంతర్వాన్ ఆచార్య 108 ప్రసన్న సాగర్ జైన్ గురువు ప్రవచనాలు విన్నారు. కీర్తనలో పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

మాట్లాడుతున్న మెదక్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్

నర్సాపూర్, ఆగస్టు 31: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని మెదక్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. శనివారం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం సౌజన్యంతో పోలీస్, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి లక్ష్యం లేకుండా చదువు కొనసాగించడం గమ్యం లేని ప్రయాణం వంటిదన్నారు. ఎవరైనా ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని, పోలీస్ శాఖ స్పందించి బాధితులకు రక్షణ కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్, పోలీస్ కళాబృందం సురేందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.సురేశ్‌కుమార్, ఏఎస్సై శ్రీనివాస్, అధ్యాపక బృందం, వలంటీర్లు పాల్గొన్నారు.

చాకరిమెట్ల స్వామి ఆలయంలో భక్తుల తాకిడి

చాకరిమెట్లలో పూజలు చేస్తున్న భక్తులు

శివ్వంపేట, ఆగస్టు 31: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా చిన్నగొట్టిముక్కపం చాయతీలోని చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో హోమం, చందనాభిషేకం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వర్గీయ కొడకంచి సత్యాగౌడ్ జ్ఞాపకార్థం శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌గౌడ్, నర్సింలుగౌడ్ అన్నదానం చేశారు. పూజల్లో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఈవో సార శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తు శర్మ, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

పేటలో మండల స్థాయి క్రీడాపోటీలు

రామాయంపేట, ఆగస్టు 31: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈనెల 2, 3, 4వ తేదీల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను రామాయంపేట ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అండర్ 14 నుంచి 17 ఏండ్లలోపు విద్యార్థులు పాల్గొనాలన్నారు. వారి టీచర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే కబడ్డీలో పాల్గొనేందుకు 400 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. సమావేశంలో పీడీలు నాగచందర్, కిరణ్, రవి, గీత, శోభ, యాదగిరి ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నశంకరంపేట, ఆగస్టు 31: మండలంలోని ధర్పల్లి జడ్పీహెచ్ఎస్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు శనివారం కంటి పరీక్షలు చేశారు. 26 మందికి కంటి దోషాలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఆప్తమాలజీ అధికారి మోహన్‌చారి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంతోష, ఏఎన్ఎం జయంత్, ఆశవర్కర్ నాగమణి, హెచ్ఎం శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా త్వరగా పూర్తి చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

మెదక్‌రూరల్, ఆగస్టు 31: ఓటరు జాబితా పరిశీలన, హౌస్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యా దయ్య ఆదేశించారు. శనివారం మెదక్ ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఓటరు జాబితాపై పంచాయతీ కార్యదర్శులతో అవగాహన సమావేశం నిర్వహించారు. అక్కడ ఎంపీడీవో రఘు లేక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఎంపీవోను అడుగగా ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న పాపన్నపేటకు వెళ్లారని చెప్పారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ జాబితాలో తప్పుల సవరణ పూర్తి చేసి ఈనెల 6వ తేదీన అన్ని పంచాయతీల్లో ప్రదర్శించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఓటరు జాబితాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

అవగాహన కల్పిస్తున్న ఎస్సై నారాయణ

చిన్నశంకరంపేట, ఆగస్టు 31: వినాయక మండలపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై నారాయణగౌడ్ సూచించారు. శనివారం చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లిలో సీసీ కెమెరాల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అందులో రికార్డు కావడం లేదని గ్రామస్తులు ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. కాగా, ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని సరిచేయిస్తామన్నారు.

సీపీఎస్ వ్యతిరేక ర్యాలీని విజయవంతం చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 31: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీకి హాజరు కావాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, కృష్ణ ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలోని టీవీన్జీవో భవన్ నుంచి ర్యాలీ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట, ఆగస్టు 31: పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని టీఆర్టీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సిద్ధుల మహేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం నిజాంపేటలో మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2004 నుంచి అమలు అవుతున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేడు మెదక్‌లో నిర్వహించనున్న పెన్షన్ విద్రోహ దినంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు విజయవంతం చేయాలన్నారు. మండల అధ్యక్షుడు నవీన్‌రత్నాకర్ ఉన్నారు.

జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్ష సూచన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- ఎమర్జెన్సీ ఉంటే 9391942254లో సంప్రదించాలి
- మండల స్థాయిలో నూ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలి
- దోమల నివారణకు రోజూ శానిటైజేషన్ చేయాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కొల్చారంలోని ఓ ఇంటి ముందు నీళ్ల కుండీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, ఆగస్టు 31, (నమస్తే తెలంగాణ): వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు ఆదేశించారు. శనివారం ఐసీడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో రెడ్ అలెర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు పని చేసే చోట కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని, అత్యవసర సేవలకు స్పందించి ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని వర్షాలు, వరదలు సంభవించినప్పుడు లో లెవల్ కల్వర్టులు, నీరు చేరిన రహదారులు దాటకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ స్థాయిలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు. ఇంటిపట్టున ఉండాలని, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు వ్యవసాయ పనులకు వెళ్లొద్దని తెలిపారు. జిల్లా స్థాయిలో 9391942254 నంబర్ 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో కంట్రోల్ రూం ఏర్పాటు

వెల్దుర్తి, ఆగస్టు 31: భారీ వర్షాల ప్రకటనతో మాసాయిపేట మండలంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జాన్షన్‌జ్యోతి ప్రకటనలో తెలిపారు. రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొల్చారం, ఆగస్టు 31: సీజనల్ వ్యాధులపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. కొల్చారంలో కలెక్టర్ శనివారం పర్యటించారు. పీహెచ్‌సీలోని రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. హాయ్ విభాగం వైద్యులు హర్ష, ఫార్మాసిస్టు రజిత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ గౌడ్ అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మందుల గదిని పరిశీలించి స్టాక్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, అంటువ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని వీధుల గుండా పర్యటించారు. ఓ ఇంటి ముందు నీళ్ల కుండీలో మురుగు నీరు నిల్వ ఉండడం, అందులో దోమలు, లార్వాలు ఉండడాన్ని గమనించి పంచాయతీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలో పర్యటిస్తున్నావా అంటూ ప్రశ్నించారు. గ్రామంలో వ్యర్థాలు, చెత్తను తొలిగించాలని ఆదేశించారు. ఈ క్రమంలో తమ గ్రామంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయిందని, పిచ్చి మొక్కలు పెరిగాయని, గడ్డి మందు పిచికారీ చేయాలని పంచాయతీ సెక్రటరీని అడిగినా పట్టించుకోవడం లేదని నాయిని జలాల్పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు సెక్రటరీకి నోటీసు ఇవ్వాలని ఎంపీడీవో కృష్ణవేణిని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గఫర్‌మియా, ఎంపీడీవో కృష్ణవేణి, ఎంపీహెచ్‌వో మదన్మోహన్, ఫార్మాసిస్ట్ సరిత, పంచాయతీ కార్యదర్శి అంజయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

మెదక్ మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు (ఇన్‌సెట్‌లో) చైర్మన్ చంద్రపాల్

- మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 31: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. శనివారం చంద్రపాల్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్స్పెక్టర్ మల్లికార్జున్‌ను సభ్యులు కృష్ణారెడ్డి, సమియొద్దిన్, కల్యాణి, కిశోర్ కోరారు. వార్డుల వారీగా ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని కమిషనర్ జానకిరామ్ సాగర్‌ను చైర్మన్ ఆదేశించారు. వార్డుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని మహిళా కౌన్సిలర్ కల్యాణి కోరారు. వినాయక చవితి సందర్భంగా వార్డుల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రాందాస్ చౌరస్తాలోని షాపింగ్ కాంప్లెక్స్ పనులు ఆగిపోవడంతో వర్షపు నీరు నిలిచి దోమలు పెరుగుతున్నాయని, చర్యలు తీసుకోవాలని డీఈ మహేశ్‌ను వైస్ చైర్మన్ కోరారు. తైబజార్ టెండర్ రద్దు చేశారా.. వాయిదా వేశారా అని కౌన్సిలర్ కృష్ణారెడ్డి అడిగారు. దరఖాస్తులు రాక వాయిదా వేసినట్లు చైర్మన్ చెప్పారు. ఐడీఎస్ఎంటీ పేజ్-2లో ప్లాట్లకు డబ్బులు చెల్లించినా రిజిస్ట్రేషన్ చేయడం లేదని కౌన్సిలర్ ఆంజనేయలు కమిషనర్ దృష్టికి తెచ్చారు. నిధులు వెచ్చించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎజెండాలోని అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో కౌన్సిలర్లు జయరాజ్, శ్రీనివాస్, శేఖర్, లక్ష్మీనారాయణగౌడ్, సుంకయ్య, లింగం, లక్ష్మి, జయశ్రీ, గాయత్రి, వేదవతి, శంసున్నిసా బేగం, కోఆప్షన్ సభ్యులు గంగాధర్, ఉమర్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

పారిశుధ్య కార్మికురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

పారిశుధ్య కార్మికురాలు దుర్గమ్మ మృతి చెందిందని, ఆమెకు రావాల్సిన బెన్‌ఫిట్స్ ఇప్పించడంలో అధికారులు సహకరించడం లేదని మృతురాలి కుటుంబ సభ్యులు మున్సిపల్ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. బెన్‌ఫిట్స్‌తో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ జోక్యం చేసుకుని సకాలంలో బెన్‌ఫిట్స్ వచ్చేలా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా చూస్తామని తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య

నరేందర్‌గౌడ్ (ఫైల్)

నర్సాపూర్, ఆగస్టు 31: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లపల్లిలో శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లికి చెందిన ఉసిరికపల్లి నరేందర్‌గౌడ్ (35) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. నరేందర్‌గౌడ్‌కు భార్య కవిత, కుమారుడు మణికంఠ, కూతురు ప్రణతి ఉన్నారు. కుమారుడు మణికంఠకు పుట్టిన నుంచి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. చికిత్స కోసం పదేండ్లుగా సుమారు రూ.10 లక్షలు అప్పు చేశాడు. దీంతోపాటు తన పొలాన్ని కూడా అమ్మేశాడు. తన కుమారుడి ఆపరేషన్ కోసం ఇంకా డబ్బు కావాలని వైద్యులు సూచించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ విషయం మిత్రులు, కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడేవాడు. అప్పుల బాధ తట్టుకోలేక శనివారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి ఉరేసుకుని కనపడ్డాడు. నరేందర్‌గౌడ్ కుమారుడు మణికంఠ ఆపరేషన్‌కు దాతలు ఆర్థిక సాయం చేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

రవి (ఫైల్)

చిన్నశంకరంపేట, ఆగస్టు 31: మద్యం మత్తు లో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబాజిపేటలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అంబాజిపేట గ్రామానికి చెందిన మల్గా రవి(48) శుక్రవారం అతిగా మద్యం తాగాడు. మద్యం మత్తులో గవ్వలపల్లి చౌరస్తాలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం నార్సింగిలోని ఓ ప్రైవేటు దవాఖానకు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య సుగుణ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంట రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణ

వెల్దుర్తి: మాసాయిపేట రైతు వేదికలో వివరాలు సేకరిస్తున్న ఏడీఏ పుణ్యవతి

వెల్దుర్తి/చిలిపిచెడ్, ఆగస్టు 31. మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లి, రామంతాపూర్, అచ్చంపేట గ్రామాల్లో రైతు కుటుంబ వివరాలను కౌడిపల్లి డివిజన్ ఏడీఏ పుణ్యవతి ఆధ్వర్యంలో సేకరించారు. పంట రుణమాఫీ కాని రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చిలిపిచెడ్ వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. శనివారం చిలిపిచెడ్ రైతు వేదిక వద్ద ఏఈవోలు భూపాల్, రమ్య దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ కారణాలతో పంట రుణమాఫీ కాని రైతుల వివరాలు వ్యవసాయ శాఖ నుంచి వచ్చాయని, వాటిలోని పేర్ల ఆధారంగా రైతు, వారి కుటుంబ వివరాలు, ఏయే బ్యాంకులో రుణాలు ఉన్నాయి, మొతం ఎంత, రేషన్ కార్డు లేని వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. మాసాయిపేట మండలంలోని కెనరా, ఐసీఐసీఐ బ్యాంకుల్లో మొత్తం 238 రైతులు ఉండగా ఇప్పటి వరకు 100 మంది రైతుల వివరాలు సేకరించినట్లు ఏడీఏ తెలిపారు.

చిలిపిచెడ్: చుండూరులో వివరాలను సేకరిస్తున్న ఏవో రాజశేఖర్‌గౌడ్

అందరూ కలిసి మెలిసి ఉండాలి

నిజాంపేటలో పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఆర్ఐ

నిజాంపేట, ఆగస్టు 31: గ్రామంలోని అన్ని కులాల వారు కలిసి మెలిసి ఉండాలని ఆర్ఐ గంగాధర్ గౌడ్ అన్నారు. శనివారం వెంకటాపూర్(కె) గ్రామంలోని ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపినా, అగౌరవంగా మాట్లాడినా చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు నందు, రాజేశం, రాజేందర్ పాల్గొన్నారు.

ఉప్పలింగాపూర్‌లో సివిల్ రైట్స్ డే

వెల్దుర్తి, ఆగస్టు 31: ఉప్పులింగాపూర్ గ్రామంలో సివిల్‌రైట్స్ డే సమావేశం శనివారం నిర్వహించారు. అసమానతలు పాటించవద్దని, అందరు సమానమేనని హెడ్ కానిస్టేబుల్ లాయక్ అలీ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

కిడ్నీబాధితుడికి ఆర్థికసాయం

శివ్వంపేట, ఆగస్టు 31: బిక్యతండాకు చెందిన కూన్యనాయక్ కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ పబ్బు మహేశ్‌గుప్తా రూ.8వేల ఆర్థిక సాయాన్ని మాజీ వార్డు సభ్యుడు కిషన్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు.

ఉద్యోగ విరమణ సహజం

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి నీలిమ

కౌడిపల్లిలో మాట్లాడుతున్న నీలిమ

కౌడిపల్లి, ఆగస్టు31: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి నీలిమ తెలిపారు. శనివారం బీసీ హాస్టల్ ప్రాంగణంలో వాచ్‌మెన్ ఉద్యోగ విరమణ ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వాచ్‌మెన్ కిష్టయ్య 40 ఏండ్లుగా పని చేస్తూ, ఎలాంటి మచ్చ లేకుండా వృత్తిని కొనసాగించా రన్నారు. వాచ్ మెన్ అంటే అన్ని తానై హాస్టల్‌ను చూడాల్సిన బాధ్యత ఉంటుంద న్నారు. కార్యక్రమంలో వార్డెన్ జయరాజ్, దుర్గయ్య, సత్తాగౌడ్, గేమ్‌సింగ్, మంజుల, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగ విరమణ

నిజాంపేట, ఆగస్టు 31: నిజాంపేటలోని వంజర సంఘంలో అంగన్‌వాడీ కార్యకర్తల పదవీ విరమణ కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఉద్యోగ విరమణ పొందిన సుగుణమ్మ, సీతా మహాలక్ష్మి, లక్ష్మీబాయి, ఐలమ్మ, నాగవ్వకు వంజరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశం దంపతులు, మాజీ జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ సన్మానించారు. మాజీ ఉప సర్పంచ్ బాబు, నరేందర్, మహేందర్, మహేశ్, రమేశ్ ఉన్నారు.

నిజాంపేటలో అంగన్‌వాడీ కార్యకర్తకు సన్మానం

నేటి నుంచి పాఠశాలల్లో

'స్వచ్ఛతా పక్వాడా'

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 31: నేటి నుంచి 15వ తేదీ వరకు పాఠశాలల్లో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లుల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి డీఈవోలకు శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. పరిసరాల శుభ్రత, పారిశుధ్యం, నీటి పొదుపు, వర్షపు నీటిని నిల్వ చేయడం, విద్యార్థుల ఆరోగ్యం, అలవాట్లపై అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

మెదక్ అర్బన్, ఆగస్టు 31: శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని 1 నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు.

ప్రతి జర్నలిస్టుకు ప్రతి నెలా వేతనం చెల్లించాలి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 31: రాష్ట్రంలోని ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం వేతనం చెల్లించాలని ఉర్దూ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దిన్ శనివారం ప్రకటనలో కోరారు. ఉద్యమ సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా కీలక పాత్ర పోషించారని, జర్నలిస్టుల ను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్టు కుటుంబాలను గుర్తించి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు.

సగరులు రాజకీయంగా ఎదగాలి

రామాయంపేట, ఆగస్టు 31: సగరులు రాజకీయంగా ఎదగాలంటే ఐకమత్యంగా ఉండాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిలు, ప్రధాన కార్యదర్శులు నగేశ్, దత్తు పేర్కొన్నారు. శనివారం రామాయంపేట చిత్తారమ్మ దేవాలయంలో సగరుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 4న సగరుల చలో హైదరాబాద్ రాజకీయ చైతన్య సదస్సుకు భారీగా తరలిరావాలన్నారు. సగరులకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వంలో హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోషాధికారి బాలకిషన్, రవీందర్, వగ్గ శ్రీకాంత్, రామారపు పోచయ్య, ఉప్పరి సాయిలు, భూమయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్



ADMISSIONS

★Seats available in Engineering, Medical & other Courses in Colleges of Hyderabad. Contact: 7799111873, 7799111874. NT-333107-All

BUSINESS OFFER

★SSS GRAPHICS Wanted District Wise Franchisees & also Distributors for 2025 Diaries and Calendars. Cont: 8639471849, 8790523529, Hyderabad. NT-331739

KIDNY STONES

★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య